ప్రజాశక్తి
సోమవారం 14 ఏప్రిల్ 2025
5
విజయనగరం



నేడు అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన సోమవారం రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు బాలాజీ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో సభ ఏర్పాటు చేస్తున్నారు.

దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్ అన్నాడు మహాకవి గురజాడ అప్పారావు. ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్... అని కూడా ఉద్బోధించాడాయన. ఆ మహాకవి దార్శనీకత, ముందుచూపు నేటి పాలకులను కూడా ప్రశ్నిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ఉపాధి హామీలో భాగంగా ప్రభుత్వం మట్టి పనులు కల్పిస్తున్నప్పటికీ ఆ పనులు చేసిన కూలీలకు డబ్బులు మాత్రం చెల్లించడం లేదు. సుమారు మూడు నెలలుగా కూలి చెల్లించకపోవడంతో లక్షలాది మంది కూలీలు పుట్టెడు అవస్థలతో ఈసురోమంటున్నారు. వీరి సమస్యలపై చర్చించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు కూడా ఇటీవల జరిగిన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశానికి సమయం దొరకలేదంటే.. చిత్తశుద్ధి ఏపాటిదో వేరేగా చెప్పనక్కర్లేదు.

బొబ్బిలి మండలం గున్నతోటవలసలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

3 నెలలుగా అందని ఉపాధి వేతనాలు

జిల్లాలో 67.51 కోట్ల బకాయి

ఆర్థిక ఇబ్బందుల్లో కూలీలు

కూలి రాక.. పూట గడవక

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/విలేకర్ల బృందం

అసలే విజయనగరం జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. వ్యవసాయ ఆధారిత జిల్లా అయినా తగిన సాగునీటి వనరులు లేవు. ఈనేపథ్యంలో 2005లో అప్పటి యుపిఎ -1 ప్రభుత్వం కమ్యూనిస్టుల ఒత్తిడితో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఏడాదిలో వంద రోజులపాటు పని గ్యారెంటీ కావడంతో వ్యవసాయ కార్మికులు, చిన్న, మధ్య తరగతి రైతులు, ఇతర వృత్తిదారులకు ఈ చట్టం ఎంతో ఆసరాగా నిలుస్తోంది. కేవలం దీనిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు కూడా ఉన్నాయంటే అతిశయోక్తి లేదు. దేశంలోనే అందరికన్నా ఎక్కువ పనిదినాలు ఉపయోగించుకుంటున్న జిల్లాగా గుర్తింపు పొందడం, అవార్డులు, రివార్డులు అందుకోవడం ఇందుకు తార్కాణంగా చెప్పొచ్చు. ఇటువంటి ఉపాధి హామీ ద్వారా పనిచేసిన కూలీలకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో కూలీలు ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు. జిల్లాలో 3.84 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. వీరంతా ఈ ఏడాది_జనవరి 16 నుంచి ఇప్పటివరకు చేసిన 32 వేల పనిదినాలకు గాను రూ.67.51 కోట్ల బకాయి ఉంది. కూలీలు పని అడిగిన వెంటనే కల్పించడంతోపాటు 14 రోజుల్లోపు చెల్లింపులు కూడా చేయాలని, లేదంటే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఉపాధి హామీ చట్టం చెబుతోంది. ఈ నిబంధనలను, ముఖ్యంగా చెల్లింపు విషయాల్లో తరచూ ప్రభుత్వం అతిక్రమించడం, ఈసారి చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మూడు నెలలపాటు వేతనాలు చెల్లించకపోవడంతో సర్కారు ఉద్దేశ పూర్వకంగానే ఈ చట్టాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోందన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. వేతనాలు అందకపోవడంతో నిత్యావసర సరుకులు కొనుక్కోలేకపోతున్నామంటూ కొందరు, ఉగాది కూడా సరదాగా చేసుకోలేకపోయామంటూ మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు, ఉద్యోగులు, అధికారులకు వేతనాలు ఇవ్వకపోతే ఇలాగే ఊరుకుంటారా? అంటూ మరికొంతమంది ప్రశ్నిస్తున్నారు.

రూ.70 లక్షలు పెండింగ్

బొబ్బిలి మండలంలోని ఉపాధి కూలీల బకాయిలు రూ.70 లక్షలు వరకు పేరుకు పోయాయి. ఆఖరి సారిగా 15 రోజుల క్రితం రూ.12 లక్షలు కొన్ని పంచాయతీలకు చెల్లింపులు చేశామని ఎపిఒ లక్ష్మీపతిరాజు తెలిపారు. ఇంకా రూ.70 లక్షలు కూలీలకు ఇవ్వాల్సి ఉంది. చెల్లించినవి కూడా ఫిబ్రవరి ఒకటో తేది వరకు మాత్రమే చెల్లింపు చేశారు. ఆరు వారాలుగా కూలీలకు చెల్లింపులు చేయడం లేదు. దాదాపు 3500 మంది కూలీలకు చెల్లింపులు చెయ్యాల్సి ఉంది

ఒక్క రూపాయీ రాలేదు

ఆరు వారాల నుంచి చెరువు పనులు చేస్తున్నాను. అప్పటి నుంచీ కూలి అందడం లేదు. ఇంతవరకూ ఒక్క రూపాయి రాలేదు. డబ్బులు పడతాయని ఎదురు చూస్తున్నాను.

– పప్పల శ్రీదేవి, గున్నతోట వలస, బొబ్బిలి మండలం

చీపురుపల్లిలో రూ.3 కోట్ల బకాయి

చీపురుపల్లి మండలంలో ఉపాధి హామీ కూలీలకు రూ.3 కోట్ల వరకు బకాయి ఉంది. మండలంలో ఫిబ్రవరి నెలలో 6 వేల మంది, మార్చిలో 3500 మంది, ఏప్రిల్ తొమ్మిదో తేదీ వరకు 3200 మంది వేతనదారులు ఉపాధి పనులు చేశారు. మొత్తం 12,700 మంది పనులు చేయగా, వీరికి బకాయి రూ.3 కోట్లు వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

12 వేల మందికి పైగా బకాయి

రేగిడి మండలంలో 39 పంచాయతీల పరిధిలోని 66 గ్రామాల్లో ఉపాధి పనులు చేపడుతున్నారు. సుమారు 12 వేలకు పైగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. వీరికి రెండు నెలలుగా 80 లక్షల రూపాయల వరకు ప్రభుత్వం నుంచి కూలి డబ్బులు రావలసి ఉంది.

భత్యం ఇవ్వడం లేదు

గత రెండు నెలలుగా చెరువు, కాలువ పనులు చేశాం. ఇంతవరకూ కూలి భత్యం ఇవ్వడం లేదు. పనుల వద్దకు ఉపాధి అధికారులు వస్తే, కూలి డబ్బులు రాలేదని చెప్పాం. వస్తాయని చెబుతున్నారు తప్ప ఇంకా ఇవ్వలేదు. డబ్బులు రాక కుటుంబంతో ఆకలితో అలమటిస్తున్నాం.

– బొత్స సూర్యుడమ్మ, సంకిలి, రేగిడి మండలం

3 నెలలుగా అందని కూలి

నెల్లిమర్ల మండలంలో మూడు నెలలుగా ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించడం లేదు. జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకు కూలి ఇవ్వలేదు. మండలంలో సుమారు 3 వేల మంది ఉపాధి వేతనదారులకు రూ.1.50 కోట్లు వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. దీంతో కూలీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

మూడు నెలలు నుంచి ఉపాధి హామీ పనులకు వెళ్తున్నా. ఇంతవరకూ వేతనాలు చెల్లించలేదు. వేతనాలు అందకపోవడం కుటుంబం మొత్తం ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే వేతన బకాయిలు చెల్లించి ఆదుకోవాలి.

– సాయి దుర్గ, కొత్తపేట, నెల్లిమర్ల

కూలీల ఆందోళన

శృంగవరపుకోట మండలంలోని 26 పంచాయతీల పరిధిలో 232 ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఉపాధి కూలీలకు గత ఎనిమిది వారాల నుంచి బిల్లులు అందడం లేదు. దీంతో కూలీలు జీవనం గడవడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో బకాయి వేతనాలు చెల్లించాలని సిపిఎం ఆధ్వర్యంలో పలుమార్లు ఎంపిడిఒ కార్యాలయం వద్ద కూలీలు ధర్నా నిర్వహించారు. బిల్లులు వెంటనే విడుదల చేయాలని వినతి పత్రాలను సైతం అందజేశారు.

ఆటో ఛార్జీకే రూ.40

గత ఏడు వారాల నుంచి ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాను. సుమారు 8 వేల రూపాయలు కూలి అందాల్సి ఉన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా వేయలేదు. ప్రతిరోజూ ఈ పనుల కోసం ఆటోకు రూ.40 ఛార్జీ చెల్లించి వెళ్తున్నాం.

– శీల రమణమ్మ, ఎస్‌సి కాలనీ, భోగాపురం

మండుటెండలో పనులు చేస్తున్న కూలీలు

బదిలీల్లో పిఇటిలకు
న్యాయం జరిగేనా?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏళ్ల తరబడి ఎదురు చూపులు

30 ఏళ్లుగా పిఇటిలుగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు బదిలీల్లో అన్యాయం జరుగుతుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. బదిలీల్లో సమన్యాయం పాటించకపోవడం వల్ల ఏళ్ల తరబడి సుదూర ప్రాంతాల్లో ఉన్న స్కూళ్లలోనే వారంతా పని చేయాల్సి వస్తోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లాలో పిఇటిలకు బదిలీల్లో జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం తీసుకెళ్లాయి. త్వరలో జరిగే బదిలీల్లో పీడీలతో పాటు సమన్యాయం పాటించి బదిలీల్లో న్యాయం చేయాలని పిఇటిలు కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో 2023 మే నెలలో పిఇటి, పీడీల బదిలీలు చేపట్టింది. ఎన్నడూ లేని విధంగా పిఇటి, పీడీ లను వేరు చేస్తూ బదిలీలు చేపట్టింది. పీడీలకు ఆన్‌లైన్‌లో బదిలీలు నిర్వహించి, వారికి కోరుకున్న ప్రదేశాలను అప్పగించేలా చేసింది. తర్వాత డిఇఒ కార్యాలయంలో మాన్యువల్‌గా పిఇటిలకు బదిలీలు చేపట్టింది. పిఇటిలకు వచ్చిన పాయింట్లతో గాని, సర్వీస్‌తో గాని, స్పౌజ్‌తో గానీ సంబంధం లేకుండా, వారికి నచ్చిన ప్రదేశం అనగా జిల్లా కేంద్రం నుంచి సుమారు 80 నుంచి 100 కిలోమీటర్ల దూరం ఉండే ప్రదేశాలు చూపించి కోరుకోవాలని చెప్పింది. బదిలీల్లో పిఇటి పోస్టులు ఉంటే కోరుకోవాలని, లేకుంటే లెఫ్ట్ ఓవర్ ఖాళీలు కింద పీడీలంతా కోరుకోగా మిగిలిన పోస్టులను ఎంచుకోవాలని ప్రభుత్వం జిఒ ఇచ్చింది. దీనివల్ల 45 పాయింట్లు వచ్చిన పిఇటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. రెండేళ్ల సర్వీస్ ఉండి 10 పాయింట్లు వచ్చిన పీడీలకు జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రదేశాన్ని కోరుకునే విధంగా అవకాశం కల్పించారు. దీంతో 15 నుంచి 35 ఏళ్లపాటు సర్వీసులు ఉంటూ ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దిన తమకు అన్యాయం జరిగిందని పిఇటిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామన్ సీనియారిటీ ఇస్తే అందరికీ సమన్యాయం జరుగుతుందని చెబుతున్నారు.

బిపిడికి అవకాశం కల్పించాలి

ఇన్ సర్వీసులో వేతనంతో కూడిన బిపిడిని చేసుకునే విధంగా పిఇటిలకు అవకాశం కల్పిస్తే పీడీలతో సమానంగా న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ విషయంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం పిఇటిల ఆవేదనను పరిగణనలోకి తీసుకుంటుందా? లేదా? అనేది వేచి చూడాల్సిందే.

సర్వీసు ఆధారంగా బదిలీలు చేపట్టాలి

త్వరలో చేపట్టే ఉపాధ్యాయ బదిలీల్లో పిఇటిలకు స్కూల్ అసిస్టెంట్ పిఇటిలతో సమానంగా సర్వీస్ సీనియారిటీ, స్టేషన్ సీనియారిటీ, ఇతరత్రా పాయింట్లు లెక్కించాలి. జిల్లాలో మొత్తం ఖాళీలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇరువురికి వచ్చిన మొత్తం పాయింట్లు చూసి, కౌన్సిలింగ్ నిర్వహించి, న్యాయం చేయాలి.

– కోలా లక్ష్మణరావు, పిఇటి

పిఇటిలకు అవకాశం కల్పించాలి

తక్కువ విద్యార్థులున్న పాఠశాలల్లో పిఇటిలకు అవకాశం ఇస్తే వారికి న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. రెండు కంటే ఎక్కువ పీడీ పోస్టులు ఉన్న చోట పిఇటికి అవకాశం ఇవ్వాలి. ఇన్ సర్వీస్ బిపిడి చేసే అవకాశం పిఇటిలకు కల్పించాలి. సీనియర్ పిఇటిలకు జిల్లా కేంద్రానికి సమీపంలోని పాఠశాలల్లో రెండో పోస్ట్ కల్పిస్తే సముచితంగా ఉంటుంది.

– జి.లక్ష్మణరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు

ఇళ్ల నిర్మాణాలకు అదనపు సాయం

- వివిధ దశల్లో 23,700 ఇళ్లు
- రాక్రిడ్ స్థానంలో వేరొక నిర్మాణ సంస్థకు సన్నాహాలు
- కొత్త ఇళ్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ
- గృహ నిర్మాణానికి ప్రభుత్వ ప్రాధాన్యత
- 'ప్రజాశక్తి'తో హౌసింగ్ పీడీ మురళీ మోహన్ ముఖాముఖి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అదనపు సాయం అందిస్తోందని గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.మురళీమోహన్ అన్నారు. ఇప్పటికే 5,310 మంది లబ్ధిదారులు ఈ రకమైన సాయాన్ని అందుకున్నారని స్పష్టం చేశారు. గృహ నిర్మాణాలన్నీ ఇటీవల ఊపందుకున్నాయని, వివిధ దశల్లో 23,700 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. గుంకలాం, కొండకరకాం లేఅవుట్లలో రాక్రిడ్ నిర్మాణ సంస్థ స్థానంలో వేరొక నిర్మాణ సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వివరించారు. కొత్త ఇళ్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరణ స్వీకరిస్తున్నా మని, ఆదేశాలు రాగానే మంజూరు ప్రక్రియ చేపడతామని అన్నారు. గడిచిన పది నెలల కాలంలో గృహ నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని, ఇక ముందు మరింతగా ఉంటుందని, దీన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

ప్రస్తుతం గృహ నిర్మాణం ఎలా జరుగుతోంది.?

గత ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా 81,999 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 70,873 వరకు నిర్మాణాలు ప్రారంభం కాగా, మిగిలిన 11,126 ఇళ్లు ప్రారంభానికి నోచుకోలేదు. ప్రారంభమైన వాటిలో 47,173 వరకు పూర్తికాగా, 1518 ఇళ్లు స్లాబు దశలో ఉన్నాయి. మిగిలిన 22,182 వివిధ దశల్లో ఉన్నాయి.

ఇళ్ల పట్టాల్లో ఎన్ని గృహ నిర్మాణాలు చేపడుతున్నారు.?

జిల్లా వ్యాప్తంగా చేపట్టిన మొత్తం 81,999 ఇళ్లలో 46,802 మంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లోనూ, మిగిలినవి సొంత స్థలాల్లోనూ నిర్మాణాలు చేపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులందరికీ రూ.1.80 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఈనేపథ్యంలో నెలవారి ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం.

లబ్ధిదారులను ఎలా ప్రోత్సహిస్తున్నారు.?

ముఖాముఖి

గతంలో ఇచ్చిన సాయం సరిపోవడం లేదనే లక్ష్యంతో అదనంగా బిసిలకు రూ.50 వేలు, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.75 వేలు, ఆదివాసీలకు రూ.లక్ష చొప్పున అదనంగా ప్రభుత్వం మంజూరు చేస్తోంది. దీంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తిచేసేందుకు ముందుకు వస్తున్నారు.

ఇప్పటి వరకు సాయం ఏమైనా అందిందా.?

అందింది... జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 15,496 మంది లబ్ధిదారులకు గృహనిర్మాణ అదనపు సాయం మంజూరైంది. ఇప్పటి వరకు 5,310 మందికి సుమారు రూ.8 కోట్ల మేర నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. మిగిలినవారు కూడా నిర్మాణాలు పునఃప్రారంభిస్తున్న నేపథ్యంలో వారికి కూడా అదనపు సాయం అందుతుంది.

గుంకలాంలో లేఅవుట్‌లో నిర్మాణాలు ఎంతమేరకు చేపట్టారు.?

విజయనగరంలోని గుంకలాం లేఅవుట్ రాష్ట్రంలోని అతిపెద్ద లేఅవుట్లలో ఒకటి. ఇక్కడ 10,139 మందికి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం ఇచ్చింది. దీనికి సమీపంలోనే కొండకరకాం లేఅవుట్‌లో మరో 2,289 మందికి ఇచ్చారు. మొత్తం 12,428లో 49 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, మరో 147 ఇళ్లు పైకప్పు వరకు వచ్చాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఇక్కడ రోడ్లు, తాగునీరు, విద్యుత్తు, తదితర సదుపాయాలు కల్పిస్తున్నాం.

మూడో పద్ధతి ఇళ్ల నిర్మాణం ఎంత వరకు వచ్చింది.?

జిల్లాలో ముఖ్యంగా గుంకలాం, కొండకరకాం లేఅవుట్ల పరిధిలో మాత్రమే ప్రభుత్వం ఇళ్లు నిర్మించాలన్న మూడో పద్ధతిలో లబ్ధిదారులు ముందుకొచ్చారు. వీటి నిర్మాణానికి పలు నిర్మాణ సంస్థలతో నాటి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆయా కాంట్రాక్టర్లు చాలా వరకు పూర్తిచేయలేదు. ఇందులోనూ ప్రధానంగా రాక్రిడ్ అనే నిర్మాణ సంస్థ పరిధిలో సుమారు 6 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయి. పనిలో లోపాలతోపాటు అసంపూర్తిగా వదిలేయడం వల్ల ప్రస్తుతం ఆ సంస్థ స్థానంలో వేరొక నిర్మాణ సంస్థను పెట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. త్వరలోనూ నిర్ణయం జరుగుతుంది. వాటని ప్రభుత్వమే నిర్మించి ఇళ్లను అప్పగించాలన్న ఆలోచనలో ఉంది.

ఇళ్ల నిర్మాణాలకు కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారా.?

ఔను! ఇప్పటి వరకు ఇళ్ల మంజూరు చేపట్టకున్నా, ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలన్నది ప్రభుత్వం లక్ష్యంగా ఉంది. అందుకే తొలి ప్రాధాన్యతలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను ముందుకు తీసుకెళ్లేందుకు అదనపు సాయం ప్రభుత్వం అందిస్తోంది. కొత్త ఇళ్ల మంజూరు కోసం కొంతకాలంగా ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. గ్రామ సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ సాగుతోంది. అనుమతులు రాగానే మంజూరు ప్రక్రియ ప్రారంభమౌతుంది.

మూగ, చెవిటి, అంధ విద్యార్థుల సమక్షంలో
మంత్రి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

అంధ విద్యార్థికి కేకు తినిపిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని ఫూల్‌బాగ్ కాలనీలో ఉన్న మూగ, చెవిటి, అంధ పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఆదివారం ఆ పాఠశాలను సతీసమేతంగా మంత్రి సందర్శించారు. మూగ, చెవిటి, అంధ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి, వారికి తినిపించారు. విద్యార్థులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో ఉన్న విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. వారితో సహపంక్తి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం బధిరుల పాఠశాల ఆవరణలో తన పుట్టినరోజు జ్ఞాపకంగా మొక్కను నాటారు. అంధుల పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ చిన్నారుల మధ్య పుట్టినరోజు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన

-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-

విజయనగరం, గరివిడి, సంతకవిటి, సాలూరు, జియ్యమ్మవలస, గజపతినగరం రూరల్, కొత్తవలసరూరల్, పాలకొండ రూరల్

ఇంటర్వ్యూ : తేది: 18-04-24 శుక్రవారం ఉదయం 10 గంటలకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు : 9490099164, 9490099156, 8331011960

ప్రజాశక్తి కార్యాలయం

అశోక్ బంగ్లా ఎదురుగా, ఆర్ అండ్ బి జంక్షన్, విజయనగరం

సిసి కెమెరాలతో నేరాల నియంత్రణ

ప్రజాశక్తి- డెంకాడ

సిసి కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చునని ఎస్ఐ. ఏ.సన్యాసినాయుడు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహం, రామాలయం, కొండ రాజుపేట గ్రామంలో రామాలయం వద్ద మొత్తం ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పి ఆదేశాల మేరకు విడతలగా అన్ని గ్రామాల్లోనూ దేవాలయాల వద్ద సచివాలయాల వద్ద గ్రామ ముఖ్య కూడళ్లలో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మిగిలిన గ్రామాల్లో విడతలు విడతలుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలో మొత్తం అన్ని పంచాయతీలతోపాటు వాటి మధుర గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

గ్రామసభలకు దండోరా వేయించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి నిర్వహించనున్న గ్రామసభలకు గ్రామంలో ప్రతి ఒక్క ఓటర్‌కు తెలిసేలా దండోరా వేయించాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని కృష్ణాపురంలో గ్రామ సభల గురించి ఆయన గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలు గురించి గ్రామస్తులను అడగగా తమకు ఏమీ తెలియదని, ఎవరూ ఏమీ చెప్పలేదని బదులిచ్చారని గ్రామ సభకి రెండు రోజులు ముందుగా గ్రామ సభకు సభ్యులైన ఓటర్లు లందరికీ తెలిసేలా దండోరా వేయించాలని, విస్తృత ప్రచారం కల్పించాల్సిన అధికారులు కల్పించకపోవడం శోచనీయమని అన్నారు. మండలంలో ఆలుగుబిల్లి, తిమిడి, సీతారాంపురం, ఎస్ఆర్ పేట, కృష్ణాపురం, రేవళ్ళపాలెం గ్రామ పంచాయతీలలో రాజ్యాంగ బద్ద గ్రామసభలు జరగనున్నాయని, ఓటర్లంతా పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం గ్రామ ఓటర్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించింది

ప్రజాశక్తి - గుర్ల

కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని వైసిపి అధ్యక్షులు పొట్నూరు సన్యాసి నాయుడు విమర్శించారు. ఆదివారం ఆయన మండల అధ్యక్ష బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా తన స్వగృహంలో విలేకరులతో మాట్లడుతూ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలపార్టీ నాయకుల సూచనలు మేరకు, అధిష్టానం నిర్ణయాలను పాటిస్తామన్నారు కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. తల్లికి వందనం, రైతు భరోసా, నిరుద్యోగ భృతి, ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ జరగలేదన్నారు. ప్రజల తరపున ప్రభుత్వం పై పోరాటం చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి ప్రమీల, మండల నాయకులు జమ్ము స్వామినాయుడు, బోళ్ల మణి, వైస్ ఎంపిపి తోట తిరుపతిరావు, వరదా ఈశ్వర రావు, కెంగువ మధుసూదన్ రావు, బెల్లాన బంగారు నాయుడు, ముద్దాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు నిర్మాణానికి మోక్షం

ప్రజాశక్తి- సంతకవిటి

శంకుస్థాపన చేస్తున్న ఎంపిటిసి గణేష్

మండలంలోని బిల్లాని పంచాయతీ ఇజ్జిపేట గ్రామానికి ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రాంభించారు. ఈ గ్రామానికి ఎందరో ప్రజాప్రతినిధులు వచ్చినా ఇంతవరకు కనీసం రోడ్డు సౌకర్యం కల్పించలేక పోయారు. ఎంపిటిసి వల్లూరి గణేష్ రోడ్డు లేక ప్రజలు పడుతున్న కష్టాలను ఎమ్మెల్యే కొండ్రు మురళీకి వివరించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో రూ.1.95 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో ఆదివారం రోడ్డు పనులను ప్రాంభించారు. ఈ సందర్భంగా ఇజ్జిపేట గ్రామ ప్రజలు స్థానిక ఎంపిటిసి వల్లూరి గణేష్‌ని ఘనంగా సత్కరించారు. ఇంత వరకూ ఎవరూ సాధించలేని విజయాన్ని గణేష్ సాధించారని కొనియాడారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఘనంగా 'గ్రాండ్ కస్టమర్ మేళా'

ప్రజాశక్తి- గంట్యాడ

గంట్యాడ మండలంలోని తాటిపూడి వద్ద సుమారు 200 ఎకరాల్లో ఐదు ఫేజ్‌లలో 1650 ఫ్లాట్స్‌ను భూమాత ఎస్‌విఎన్ స్వప్నలోక్ పేరిట వేసిన వెంచర్ వద్ద ఆదివారం గ్రాండ్ కస్టమర్ మేళా నిర్వహించారు. ఈ కస్టమర్ మేళాకు విశేష స్పందన లభించిందని 3వేల మందికి పైగా కస్టమర్లు పాల్గొన్నారని భూ మాత మేనేజింగ్ డైరెక్టర్ తాళ్లూరి పూర్ణచంద్రరావు, ఎస్‌విఎన్ గ్రూప్ ఛైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ వెంచర్‌లో ఇంత వరకూ రియల్ ఎస్టేట్ చరిత్రలో ఎవరూ ఇవ్వని సౌకర్యాలు క్లబ్‌హౌస్, స్విమ్మింగ్ పూల్ సదుపాయాలు కల్పిసుతన్నామన్నారు. ఇక్కడ ప్రతిష్టాత్మకంగా ప్రపంచంలో 7 వండర్స్ తాలూక కళాకృతులను సందర్శన కోసం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సభ్యులు, డైరెక్టర్ తాళ్లూరి శివాజి, కిరణ్ శంకర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువత

రక్తదానం ప్రాణదానం

ప్రజాశక్తి-విజయనగరం

రక్తదానం ప్రాణదానంతో సమానమని విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తామాష్ తెలిపారు. నగరంలోని బిసి కాలనీలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి ప్రారంభించారు. జిల్లాలో రక్తం నిల్వలు కొరత కారణంగా తలసేమియా పిల్లలు, గర్భిణుల కోసం ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఇల్తామాష్ తెలిపారు. శిబిరంలో 30 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన రక్త నిల్వలను విజయ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాయల్ క్యాబ్స్ శరత్, అశోక్, సాయి కుమార్, ఎన్.రఘు, రాము, పి. రఘు, విజయ బ్లడ్ బ్యాంకు మేనేజర్ పుణ్యమంతుల శివ, తదితరులు పాల్గొన్నారు.

బావిని పూడ్చేందుకు బిల్డర్ యత్నం

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని వరహగిరివీధి సందులో మున్సిపల్ నుయ్యిని పూడ్చేందుకు బిల్డర్ ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. రోడ్డు పక్కన ఉన్న మున్సిపల్ నుయ్యి నీరును అవసరాల కోసం ప్రజలు వాడుతున్నారు. నుయ్యి పక్కనున్న ఖాళీ స్థలంలో ఒక బిల్డర్ అపార్ట్ మెంట్ కట్టేందు స్థలాన్ని చదును చేస్తుండగా నుయ్యిని కూడా పూడ్చేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి ఆదేశాల మేరకు ఫిట్టర్ అప్పారావు నుయ్యి దగ్గరకు వచ్చి నుయ్యిని పూడ్చితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర

ప్రజాశక్తి - విజయనగరం కోట

టిటిడి గోవు మరణాలపై భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర చేస్తున్నారని ఎపి మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. స్థానిక అశోక్ బంగ్లాలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టిటిడిపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమన్నారు. ఈ సమావేశంలో భోగాపురం టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

కొత్తవలస: తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా పనిచేసిన కాలంలో అనేక కుంభకోణాలకు పాల్పడిన భూమన కరుణాకర్ రెడ్డి గతంలో స్వామివారి ఉనికినే ప్రశ్నించారని, అటువంటి నాస్తికుడు ఇప్పుడు ఫేక్ ఫోటోలు పెట్టుకుని గోమాతలపై విషప్రచారం చేస్తున్నారని ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులతో కలిసి ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని, టిటిడి ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో విశాఖ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు, మాజీ జెడ్‌పిటిసి కోళ్ల శ్రీను, క్లస్టర్ ఇంచార్జ్ రత్నాజీ, గొంప దుర్గా ఉమేష్, కోరుపోలు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: టిటిడి గోవు మరణాలపై భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం కేవలం మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర అని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టిటిడిపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ కరుణాకరరెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. గోశాలలను సందర్శించిన భక్తులు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తుంటే, ఇక్కడ పరిశుభ్రత లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. తాను నాస్తికుడినని స్వయంగా కరుణాకరరెడ్డి ప్రకటించుకున్న విషయం వాస్తవం కాదా? వెంకటేశ్వరస్వామిదే ముంది ఒక నల్ల రాయి, దానిని పెకిలించేస్తానంటూ గతంలో మాట్లాడలేదా.? అని ప్రశ్నించారు.

విజయనగరం: మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు

చీపురుపల్లి: టిటిడి గోశాలపై భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపణలు అర్ధరహితం, నిరాధారమని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. తప్పుడు ప్రచారాలతో మత విద్వేషాలు రెచ్చగొట్టాలన్నదే వైసిపి కుట్ర, అందులో భాగంగానే వైసిపి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి టిటిడి గోశాలపై నిరాదార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడో వేరే ప్రాంతంలో చనిపోయిన గోవుల ఫోటో చూపించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

బొబ్బిలిలో బేబినాయన విస్తృత పర్యటన

ప్రజాశక్తి - బొబ్బిలి

మండలంలో ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. బొబ్బిలి పట్టణ ప్రజలకు తాగునీరు అందించే భోజరాజపురం మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్, గొల్లాది, పెంట, భీమవరం రైతులకు సాగునీరు అందించే పారాది ఆనకట్ట కాలువ, పారాది వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు.

పట్టణ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందించాలి

పట్టణ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందించాలని ఎమ్మెల్యే బేబినాయన మున్సిపల్ అధికారులను ఆదేశించారు. భోజరాజపురం హెడ్ వాటర్ వర్క్స్ పరిశీలించి బోరుకు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ డిఇ సురేష్, ఎఇ గుప్తాతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో మున్సిపల్ ప్రజలకు ప్రతిరోజు తాగునీరు అందించేందుకు అవకాశాలు ఎంత వరకు ఉన్నాయని ఎమ్మెల్యే ప్రశ్నించగా పట్టణ జనాభా పెరిగారని, పాత పంపు హౌస్, పైపులైన్ కావడంతో ప్రతిరోజు సరఫరా చేసేందుకు అవకాశం లేదని ఎఇ గుప్తా అన్నారు. సీతానగరం సువర్ణముఖి నది నుంచి మున్సిపాలిటీకు తాగునీరు అందించే ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యే వరకు ప్రజలు తాగునీరు కోసం ఇబ్బందులు పడకుండా కొత్త ఇన్ ఫిల్టర్ బావికి ప్రతిపాదనలు చేయాలన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా లీకులను నివారించి తాగునీరు అందించాలని ఆదేశించారు.

కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

రైతులకు సాగునీరు అందించేందుకు ప్రాధాన్యత

పారాది ఆనకట్ట కాలువ పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ జెఇ హరిని ఆదేశించారు. గొల్లాది, భీమవరం, పెంట రైతులకు సాగునీరు అందించే కాలువ వేగావతి నది కంటే ఎత్తుగా ఉండడంతో రైతులకు సంపూర్ణంగా సాగునీరు అందడం లేదని ఎమ్మెల్యే బేబినాయనకు జెఇ హరి వివరించారు. భోజరాజపురం వద్ద డైక్ నిర్మిస్తే రైతులకు సాగునీరు, మున్సిపల్ ప్రజలకు తాగునీరు అందించడం సులభంగా ఉంటుందని చెప్పగా భోజరాజపురం, పాల్తేరు వద్ద డైక్‌లు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలన్నారు.

పారాది వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం

పారాది వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పారాది వంతెన నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. తన సోదరుడు సుజయకృష్ణ రంగారావు మంత్రిగా ఉన్న సమయంలో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పూర్తిగా పనులను ప్రారంభించలేదన్నారు. తమ తాత పారాది వంతెన నిర్మాణం చేశారని, వంతెన శిథిలావస్థకు చేరడంతో నూతన వంతెనకు తన సోదరుడు నిధులు మంజూరు చేశారన్నారు. వైసిపి నిర్లక్ష్యంతో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసే అదృష్టం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. ఆయనతో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర శాశ్వత అడ్వైజర్ కమిటీ సభ్యులుగా బెల్లాన

ప్రజాశక్తి - చీపురుపల్లి

వైసిపి రాష్ట్ర శాశ్వత అడ్వైజర్ కమిటీ సభ్యులుగా మాజీ ఎంపి బెల్లాన చంద్ర శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ నుంచి బెల్లానకు ఉత్తర్వులు అందాయని బెల్లాన కార్యాలయం నుంచి తెలిపారు. 33 మంది సభ్యులతో ఏర్పాటైన అడ్వైజర్ కమిటీని వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన విషయం తెలిసిందే. బెల్లాన మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి స్టేట్ అడ్వైజర్ కమిటీలో స్థానం కల్పించినందుకు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలిపారు. ఈ పదవి వల్ల తనకు మరింత బాద్యత పెరిగిందన్నారు. ఆయనకు పదవి రావడం పట్ల వైసిపి మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడుతో పాటు పలువురు వైసిపి నాయకులు బెల్లానను ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ కాలేజీ విద్యార్థినిల ప్రతిభ

ప్రజాశక్తి- శంగవరపుకోట

మండలంలోని ధర్మవరం హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (బాలికల జూనియర్ కళాశాల)లో ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలు మంచి ఫలితాలు సాధించినట్లు హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు తెలిపారు. బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో పది మంది విద్యార్థినిలు పరీక్షలు రాయగా వారిలో 9 మంది అమ్మాయిలు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపిసిలో ఏడుగురు విద్యార్థినిలు పరీక్షలు రాయగా ఏడుగురూ ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వీరిలో 10 వ తరగతి వరకూ తెలుగు మీడియం చదివి ఇంటర్ ఇంగ్లీష్ మీడియం చదివిన కొక్కెర పూజిత (గోపాలపల్లి) బైపిసిలో 830 మార్కులు సాధించి కాలేజీ ప్రథమ స్థానంలో నిలువగా, చింతల మేరీ సుప్రియ (ధర్మవరం) 799, వారాధి వాణి 736 సాధించి కళాశాల ద్వితీయ, తృతీయస్థానంలో నిలిచారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో ముగ్గురు పరీక్షలు రాయగా అందులో ఇద్దరు అమ్మాయిలు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. బూరాడ చాందిని (పోతనాపల్లి) 773 మార్కులతో ప్రథమ స్థానం, చల్లా శర్వాణి (సీతారాంపురం) 682 మార్కులతో కళాశాల ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చప్ప సాయి జాహ్నవి ఎంపిసిలో 392 మార్కులు, కోరుకొండ శిరీష 337 మార్కులు సాధించారు.

రాజాం: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో శ్రీ చైతన్య కాలేజ్ విద్యార్థులు ఉత్తమమైన మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో దూబ ప్రణతి 465 మార్కులు సాధించి నగరంలో ప్రథమ స్థానం సాధించింది. జూనియర్ ఇంటర్ బైపిసిలో గోక పల్లవి 443 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. సీనియర్ ఎంపిసిలో నల్లి తనుశ్రీ 991 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. గవర్నమెంట్ బాలికల జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపిసిలో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ కె.జనార్దన్ తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఎంపిసిలో 64శాతం, బైపిసిలో 41శాతం, సెకండియర్ ఎంపిసిలో 100శాతం, బైపిసిలో 78శాతం, సిఇసిలో 75శాతం ఉత్తీర్ణత సాధించామని చెప్పారు.

గురుకులంలో ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- రేగిడి

రేగిడి: పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు ఆదివారం పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో 150 మంది ఐదో తరగతి విద్యార్థులకు గాను 52 మంది పరీక్షలు రాశారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి 139 విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా కేవలం 56 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ఆదివారం 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 123 మందికి 89 మంది హాజరవ్వగా 34 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షకు 76 మందికి 61 మంది హాజరవ్వగా, 15 మంది గైర్హాజరయ్యారు. ప్రవేశ పరీక్షలను డిటి సన్యాసినాయుడు, అడిషనల్ సెక్రటరీ సునీల్ రాజు కుమార్ పరిశీలించారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలిలో భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం నిర్వహించారు. సిబిఎం చర్చి క్రైస్తవులు ఈత కొమ్మలతో పట్టణంలో నగర సంకీర్తన చేశారు. సైంట్ ఆండ్రూస్ లూథరన్ చర్చిలో మట్టల ఆదివారం నిర్వహించారు. మానవాళి రక్షణ కోసం క్రీస్తు ప్రభువు సిలువ మీద చూపిన ప్రేమ, క్షమాగుణం ప్రతివారు కలిగివుండి ఇతరులకు ఆ ప్రేమను చూపించాలని మహారాణి పేటలోని సైంట్ ఆండ్రూస్ లూథరన్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ జాన్ విక్టర్, సిబిఎం చర్చి ఫాదర్ అశోక్ అన్నారు. పాస్టర్ జాన్ విక్టర్, చర్చ్ డెలిగేట్ జెసి రాజు ఆధ్వర్యంలో మట్టలను ప్రదర్శించారు. కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ఆరికతోట ఎడిఎం బాప్టిస్ట్ చర్చి కాపరుల ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈత, ఖర్జూర మట్టలను పట్టుకొని ఆదివారం వీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం యేసు క్రీస్తు నామాన్ని జపిస్తూ చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు క్రీస్తు శత్రు సంహారం చేసి గాడిద పిల్లల నిక్కి గ్రామ సంచారం చేసేందుకు వస్తుండగా ఆ గ్రామ ప్రజలంతా యేసయ్యకు స్వాగతం పలికేందుకు వివిధ చెట్ల మట్టలను, వస్త్రాలను పరచి ఆహ్వానించిన రోజు ఈ పవిత్ర దినంగా బావించి ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా వస్తున్నట్లు సంఘ కాపరులు తెలిపారు.

మట్టల ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు

విజయనగరం టౌన్ : నగరంలో ఆదివారం ఏసుప్రేమాలయం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ర్యాలీ ఘనంగా చేపట్టారు. పాస్టర్ అలజంగి రవికుమార్ ఈ ర్యాలీని ప్రారంభించి మట్టల ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు. అంబటిసత్రం కూడలిలో ఏసు ప్రేమాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మూడు లాంతర్ల కూడలి, గంటస్తంభం కూడలి, పార్కుగేట్ కూడలి మీదుగా కమ్మవీధి గుండా తిరిగి ఏసు ప్రేమాలయానికి చేరుకుంది.

నైతిక ప్రవర్తనపై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం నైతిక ప్రవర్తనపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు అధ్యక్షతన ఎస్ఐ బి. దేవి విద్యార్థులకు నైతిక ప్రవర్తన, సాంఘిక నేరాలు, లైంగిక దాడుల పట్ల అప్రమత్తత, పోస్కో చట్టం, మాదక ద్రవ్యాల పట్ల జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఇటీవల జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికైన 9వ తరగతి విద్యార్థిని ఎం.హాసినిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, కౌమార విద్య ఇంచార్జి ఉపాధ్యాయులు ఎం.గౌరీ, పాఠశాల భద్రత అండ్ రక్షణ ఇంచార్జి ఉపాధ్యాయులు ఎస్. గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సోంపురం గ్రామంలో ఆదివారం ఎరుకల వీధిలోను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వల్లంపూడి ఎస్ఐ బి.దేవి గ్రామస్తులకు సైబర్ నేరాలు, బెట్టింగులు, ఆన్‌లైన్ లోన్ యాప్‌లతో జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఆశపడి మోసపోవద్దని, మోసపోయిన తరువాత ఆత్మహత్యలకు పాల్పడే కంటే ముందు అటువంటి యాప్‌ల జోలికి పోవద్దని చెప్పారు. యువత చదువుపై దృష్టి పెట్టాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ దేవి

జెండా వందనం చేస్తున్న ప్రతినిధులు

మిమ్స్‌లో 'క్రీడా కృత్య 2025' వార్షికోత్సవం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్‌లో క్రీడా కృత్య 2025 క్రీడా వార్షికోత్సవం ఆదివారం శ్రీరామ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిమ్స్‌లో ఏటా క్రీడా వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా క్రీడా కృత్య 2025 ప్రారంభించామన్నారు. ముఖ్యంగా యువతలో నైపుణ్యాన్ని వెలికితీయడమే క్రీడల ముఖ్య లక్ష్యమని అన్నారు. క్రీడా కృత్యలో 2025 సాంస్కృతిక, క్రీడలు, సాహిత్యం, కళారంగాల్లో ప్రతిభను వెలికితీస్తుందని తెలిపారు. కాగా క్రీడా కృత్య క్రీడల పోటీలు 20 వరకు, కళా కృత్య పోటీలు సంగీతం, నాట్యం పోటీలు ఈ నెల 21 నుంచి 27వరకు జరుగుతాయని తెలిపారు. వీటిలో గెలుపొందిన వారికి మిమ్స్ వార్షికోత్సవం మే 8న బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ సిహెచ్ లక్ష్మీకుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి రఘురాం, అకడమిక్ డాక్టర్ టి.వేణుగోపాలరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నీలిమ పాల్గొన్నారు.

తీరిన రహదారి కష్టాలు

ప్రజాశక్తి - వేపాడ

రైవాడ కెనాల్ నుంచి బూడివారివాని కళ్లాలకు, పొలాలకు రహదారి లేక రైతులు, గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడేవారు. ఆ ఇబ్బందులను గుర్తించిన వావిలపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి పంచాయతీ నిధులు రూ.6లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. గత రెండు రోజులు రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా జరగడంతో గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను ఆదివారం నాయకులు బీల సతీష్ పర్యవేక్షించారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న సతీష్

నేడు మరిడమాంబ పండగ

వేపాడ: మండలంలోని అంకాజోస్యుల పాలెంలో సోమ, మంగళ వారాల్లో గ్రామ దేవత శ్రీమరిడి మాంబ పండగ వైభవంగా నిర్వహించనున్నామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. .

ముగ్గుల పోటీలు

ఆదివారం గ్రామంలో ముగ్గులు పోటీలను నిర్వహించారు. మొదటి విజేతగా బి.రామలక్ష్మి, రెండవ విజేతగా ఎస్.శ్రీలక్ష్మి, సిహెచ్ చిన్నమ్మలు, మూడవ విజేతగా ఆర్ వసంత నిలిచారు. వీరందరికీ పండగ సందర్భంగా మంగళవారం బహుమతులు ప్రదానం చేయనున్నారు.

చెట్టును ఢీకొని టిప్పర్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని రెడ్డిపేట పామాయిల్ ఫ్యాక్టరీ సమీపం మలుపు వద్ద చెట్టును టిప్పర్ లారీ ఢీకొన్న సంఘటనలో ఆదివారం అనకాపల్లి సమీపం కోడూరు మండలం గొల్లపేట గ్రామానికి చెందిన పల్లా నాగరాజు (30) అక్కడికక్కడే మృతి చెందారు. సాలూరు నుంచి ఇసుక కోసం టిప్పర్ లారీతో శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం ముద్దాడ పేట ఇసుక ర్యాంపునకు వస్తుండగా రెడ్డి పేట పామాయిల్ ఫ్యాక్టరీ మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. చెట్టుకు టిప్పర్ బలంగా ఢీకొట్టడంతో క్యాబిన్ నుజ్జు నుజ్జు అయింది. డ్రైవర్ అందులో చిక్కుకొని ప్రాణాలు వదిలాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడు చిన్నాన్న పల్లా దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నీలావతి తన సిబ్బందితో అతి కష్టంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య హేమ వర్షిని, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డుపై కారు దగ్ధం

ప్రజాశక్తి- డెంకాడ

విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న విశాఖకు చెందిన కారు రోడ్డుపై దగ్ధమైంది. ఆదివారం మధ్యాహ్నం నాతవలస టోల్ గేట్ వద్ద ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమవ్వగా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. కారులో ప్రయాణిస్తున్న ఒక కుటుంబం టోల్ గేట్ వద్ద కారు ఆపి పాస్ట్ ట్యాగ్ గురించి మాట్లాడుతుండగా ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగి క్షణాల్లో కారు మొత్తం కాలిపోయింది. కారు పాతది కావడం, ఎండ తీవ్రంగా ఉండటం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.